

## సోమశిలలో 35.554 టీఎంసీలు
సోమశిల: జలాశయంలో మంగళవారం నాటికి 35.554 టీఎంసీలు ఉన్నాయి. పెన్నార్ డెల్టాకు 2,550, ఉత్తర కాలువకు 250 క్యూసెక్కులను వదులుతున్నారు.



## బంగారం ధరలు

| | |
|---|---|
| 24 క్యారెట్లు (10గ్రాములు) | రూ.65,000 |
| 22 క్యారెట్లు ఆర్నమెంట్ (1గ్రా) | రూ.5,837 |
| 3శాతం జీఎస్టీతో | రూ.6012 |
| నవర (8గ్రా) | రూ.48,096 |

గరిష్ఠం/కనిష్ఠం
30.2 /21.2

## వాతావరణం
మంగళవారం గాలిలో తేమ 66 శాతంగా ఉంది. చలి వాతావరణం ఉంది. బుధవారం కూడా వాతావరణంలో పెద్దగా మార్పులేమి ఉండవు.

## న్యూస్‌రీల్

### డిగ్రీ పరీక్షల్లో ఒకరి డిబార్
వెంకటాచలం: వీఎస్‌యూ పరిధిలోని అనుబంధ కళాశాలల్లో మంగళవారం నిర్వహించిన డిగ్రీ పరీక్షల్లో ఒక విద్యార్థి డిబార్ అయినట్లు వీఎస్‌యూ పరీక్షల నిర్వహణాధికారి ఆర్ ప్రభాకర్ తెలిపారు. ఉదయం నిర్వహించిన ఒకటో సెమిస్టర్ పరీక్షకు 362 మందికి గానూ 302 మంది హాజరయ్యారు. 60 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం నిర్వహించిన మూడో సెమిస్టర్ పరీక్షకు 7,584 మందికి గానూ 7,017 మంది హాజరయ్యారు, 567 మంది గైర్హాజరయ్యారు. నెల్లూరులోని ఎస్వీ డిగ్రీ కళాశాలలో ఒక విద్యార్థి డిబార్ అయ్యారని తెలిపారు.

### 'సెయిల్ ఎనర్జీ'కి సీఎస్సార్ ఇంపాక్ట్ అవార్డు



నేలటూరులోని సెయిల్ ఎనర్జీ ప్రాజెక్ట్

ముత్తుకూరు: నేలటూరులోని స్వతంత్ర విద్యుత్ ఉత్పత్తి సంస్థ ఎస్ఈఐఎల్(సెయిల్) ఎనర్జీ ఇండియా లిమిటెడ్‌కు సీఎస్సార్ ఇంపాక్ట్ అవార్డు లభించింది. బెంగళూరులో జరిగిన ఒక కార్యక్రమంలో 'యూబీఎస్ ఫోరమ్స్' అనే సంస్థ అవార్డు అందజేసినట్టు ప్రాజెక్ట్ సీఈఓ రాఘవ్‌త్రివేది మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ ద్వారా ప్రాజెక్ట్ పరిసర గ్రామాల్లో సోలార్ వీధి దీపాలు ఏర్పాటు చేయడం, పర్యావరణ పరిరక్షణకు మొక్కల పెంపకం, సోలార్ రూఫ్‌టాప్ సిస్టమ్స్ అమర్చడం తదితర పర్యావరణ అనుకూల విధానాలకు గుర్తింపుగా ఈ అవార్డు లభించిందని వివరించారు. ఈ సందర్భంగా సీఎస్సార్ బృందాన్ని ఆయన అభినందించారు.

### ఘనంగా వీర్ బాల్ దివస్



జ్ఞాపికలతో విద్యార్థులు

నెల్లూరు (టౌన్): సమగ్ర బాలల సంరక్షణ పథకంలో భాగంగా మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నగరంలోని డీకేడబ్ల్యూ కళాశాలలో వీర్ బాల్ దివస్ కార్యక్రమాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులకు పాటలు, వ్యాసరచన, చిత్రలేఖన పోటీలు నిర్వహించి విజేతలకు జ్ఞాపికలను అందజేశారు. అనంతరం ప్రధాన మంత్రి నరేంద్రమోదీ లైవ్ సందేశాన్ని ప్రదర్శించారు. మహిళా శిశు సంక్షేమ శాఖ పీడీ హేనసుజన్, కళాశాల ప్రిన్సిపల్ గిరి, జిల్లా బాలల సంరక్షణాధికారి సురేష్, ఎన్జీఓ అధినేత శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

### ఇద్దరు సీఐల బదిలీ
నెల్లూరు(క్రైమ్): జిల్లాలో పనిచేస్తున్న ఇద్దరు సీఐలను బదిలీ చేస్తూ గుంటూరు రేంజ్ ఐజీ పాలరాజు మంగళవారం రాత్రి ఉత్తర్వులు జారీచేశారు. కావలి రూరల్ సీఐగా పనిచేస్తున్న రాజేష్‌ను కావలి ఒకటో పట్టణ ఇన్‌స్పెక్టర్‌గా, అక్కడ పనిచేస్తున్న కే శ్రీనివాసరావును రేంజ్ వీఆర్‌కు బదిలీ చేశారు. పామూరు ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న శ్రీనివాసరావును కావలి రూరల్ సీఐగా నియమించారు. శ్రీనివాసరావు గతంలో జిల్లాలోని వివిధ పోలీసుస్టేషన్లలో ఎస్‌ఐగా, కావలి ఒకటో పట్టణ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేశారు.

### నేత్రపర్వంగా గరుడ సేవ



ప్రత్యేకాలంకరణలో స్వామి

నెల్లూరు రూరల్: రూరల్ మండలం నరసింహకొండపై వెలిసిన వేదగిరి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో మంగళవారం విశేష పూజలు, నిర్వహించారు. ఉత్సవమూర్తులకు అభిషేకాలు జరిపారు. స్వామి, అమ్మవార్లను విశేషంగా అలంకరించి చిన్న గరుడసేవ, గిరిప్రదక్షిణను నేత్రపర్వంగా నిర్వహించారు. ధనుర్మాసం సందర్భంగా గోదాదేవి సన్నిధి వద్ద భక్తులు దీపాలను వెలిగించారు. ఆలయ కమిటీ సిబ్బంది, దేవాదాయ శాఖ సిబ్బంది, ఉభయకర్తలు పాల్గొన్నారు.



జనసందోహం నడుమ పాదయాత్రగా వెళ్తున్న ఎంపీ విజయసాయిరెడ్డి, ఎమ్మెల్యేలు ప్రసన్న, అనిల్, తదితరులు



నార్తురాజుపాళెం సెంటర్‌లో సామాజిక సాధికార యాత్ర బహిరంగ సభకు అశేషంగా తరలివచ్చిన జనం

# సామాజిక నీరాజనం

**జనసంద్రమైన నార్తురాజుపాళెం**
- బస్సు యాత్రకు అపూర్వ స్వాగతం
- విజయవంతమైన సామాజిక సాధికార యాత్ర
- హోరెత్తిన జైజగన్ నినాదాలు
- ప్రభుత్వం చేసిన మేలును వివరించిన ప్రజాప్రతినిధులు
- వైఎస్సార్‌సీపీ శ్రేణుల్లో నూతనోత్సాహం

సాక్షి ప్రతినిధి, నెల్లూరు/ కొడవలూరు : ప్రభుత్వం నుంచి లబ్ధి పొందిన ప్రతిఒక్కరూ చైతన్యమై స్వచ్ఛందంగా కదలి వచ్చారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో జరిగిన మేలును గుర్తుచేసుకుంటూ దారుల్లో బారులు తీరి జేజేలు పలికారు. వైఎస్సార్‌సీపీ జెండాలు చేతపట్టి జై జగన్ నినాదాలతో హోరెత్తించారు. కొడవలూరు మండలం నార్తురాజుపాళెంలో మంగళవారం జరిగిన సామాజిక సాధికార యాత్రకు జనం అశేషంగా తరలివచ్చారు. అడుగడుగునా నీరాజనాలు పలికారు. తమ అభిమాన నేతల ప్రసంగాలను ఆసక్తిగా విన్నారు. తమ బతుకుల్లో వచ్చిన మార్పులను గుర్తు చేసుకున్నారు. జగన్ వెంటే తామంతా ఉంటామని చాటి చెప్పారు. పెత్తందారులు, పేదల మధ్య జరుగుతున్న కురుక్షేత్ర యుద్ధంలో జగనన్నను మరోసారి ముఖ్యమంత్రిని చేసుకుంటామని ప్రతినబూనారు. నార్తురాజుపాళెంలో జరిగిన సామాజిక సాధికార యాత్రకు 230 బస్సులు, 300 కార్లు, 600 ఆటోల్లో జనం తరలివచ్చారు. సుమారు 15 వేల మందికి పైగా జనం తరలిరావడంతో నార్తురాజుపాళెం సెంటర్‌లో మూడు వైపులా ఉన్న రోడ్లు కిక్కిరిసిపోయాయి. తొలుత టపాతోపు అండర్ బ్రిడ్జి వద్ద నుంచి డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర, సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున, రాజ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డి, ఎమ్మెల్యేలు ప్రసన్నకుమార్‌రెడ్డి, అనిల్‌కుమార్, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖరరెడ్డి, సినీనటుడు అలీ, తదితరులు పాదయాత్రగా బయలుదేరి నార్తురాజుపాళెం కూడలి చేరుకున్నారు. వారి వెంట వేలాదిగా జనం తరలి రావడంతో ఎటు చూసిన జనసంద్రమే దర్శనమిచ్చింది. పాదయాత్రలో కేరళ సంగీతం, గుర్రాల ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. సభా ప్రాంగణంలో నిర్వహించిన సంగీత కచ్చేరి ఆహూతులను ఆకట్టుకొంది. మహిళలు సుమారు 5 వేల మందికిపైగా తరలిరాగా, వారికి ఎలాంటి అసౌకర్యం కలుగకుండా బుచ్చి రోడ్డును కేటాయించారు. పురుషులకు కొడవలూరు, నెల్లూరు వైపు రోడ్లు కేటాయించడంతో సభలో నేతలు ప్రసంగాలను అందరూ వినే వెసులుబాటు కలిగింది. సభలో ఉపముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర, సాంఘిక సంక్షేమశాఖ మంత్రి మేరుగ నాగార్జున, ఎమ్మెల్యేలు అనిల్‌కుమార్, ప్రసన్నకుమార్‌రెడ్డి, సినీనటుడు అలీ, తదితర ప్రముఖులు ప్రసంగించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు అన్ని విధాలుగా అండగా నిలిచి సంతోషంగా ఉండేలా చేసిన ఏకైక ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అని పేర్కొన్నారు. పేదల సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్న వైఎస్ జగన్‌ను మనమంతా మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకోవాలని పిలుపునిచ్చారు. సభలో అలీ ప్రసంగిస్తుండడం సభా ప్రాంగణం చప్పట్లతో దద్దరిల్లిపోయింది.

### సెంట్రల్ లైటింగ్, వైఎస్సార్ విగ్రహం ప్రారంభం
సామాజిక సాధికార బస్సు యాత్రకు ముఖ్యఅతిథిగా వచ్చిన రాజ్యసభ సభ్యులు, వైఎస్సార్‌సీపీ రీజనల్ కోఆర్డినేటర్ వేణుంబాక విజయసాయిరెడ్డి నార్తురాజుపాళెంలో వైఎస్సార్ కాంస్య విగ్రహం, సెంట్రల్ లైటింగ్‌లను రిమోట్ కంట్రోల్ ద్వారా ప్రారంభించారు. రూ.1.52 కోట్లతో వైఎస్సార్ విగ్రహం నుంచి ఏఎంసీ యార్డు వరకు సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయగా, డీసీఎమ్మెస్ చైర్మన్ వీరి చలపతి రావు తన సొంత నిధులు రూ.12 లక్షలతో వైఎస్సార్ కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో వీరి చలపతిరావు, ఏపీఎల్డీఏ, డీఏఏబీ చైర్మన్లు జీ.విజయకుమార్, నిరంజన్‌బాబురెడ్డి, ఆప్కాఫ్ చైర్మన్ కొండూరు అనిల్‌బాబు, ఏఎంసీ చైర్మన్ రాధాకృష్ణారెడ్డి, నెల్లూరు డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్‌యాదవ్, పార్టీ నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షుడు నల్లపరెడ్డి రజత్‌కుమార్‌రెడ్డి, మండల కన్వీనర్లు గంధం వెంకటశేషయ్య, సుబ్బారెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, ఎం శ్రీనివాసులురెడ్డి, సతీష్‌రెడ్డి, సచివాలయాల మండల కన్వీనర్ కే.శ్రీనివాసులురెడ్డి, ఎంపీపీ జీ జ్యోతి, జెడ్పీటీసీ పీ సరోజనమ్మ, బుచ్చిరెడ్డిపాళెం చైర్‌పర్సన్ సుప్రజ, సర్పంచ్ బీ సుప్రియ పాల్గొన్నారు.



సభావేదికపై డిప్యూటీ సీఎం రాజన్నదొర, మంత్రి మేరుగ నాగార్జున, ఎమ్మెల్యే అనిల్, సినీ నటుడు అలీ, ఎమ్మెల్సీ పోతుల సునీత, నెల్లూరు మేయర్ స్రవంతి, తదితరులు



మహనీయులకు నివాళులర్పిస్తున్న ఎంపీ విజయసాయిరెడ్డి



### మహిళలకు అండగా నిలిచిన ఘనత జగనన్నదే
కోవూరు: రాష్ట్రంలోని మహిళలను అన్ని విధాలా ఆదుకుని తోబుట్టువులా అండగా నిలిచిన ఘనత ముఖ్యమంత్రి జగనన్నదేనని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మహిళాధ్యక్షురాలు, ఎమ్మెల్సీ పోతుల సునీత అన్నారు. రాష్ట్రంలో లక్షలాది మందికి ఉద్యోగాలు కల్పించిన ఘనత సీఎం జగన్‌దేనన్నారు. జగనన్న 4 లక్షలకుపైగా ఉద్యోగాలిస్తే, ఉద్యోగాలే ఇవ్వలేదని లోకేశ్ మాట్లాడడం విడ్డూరంగా ఉందన్నారు. రుణమాఫీ చేస్తానని డ్వాక్రా మహిళలను మోసం చేసిన ఘనత చంద్రబాబుదేనన్నారు. వాస్తవాలను పక్కనపెట్టి ప్రతిపక్షాలు ఇష్టం వచ్చినట్లు విమర్శించడం దుర్మార్గమన్నారు. టీడీపీ నాయకులు అనవసర దుష్ప్రచారాలు చేస్తున్నారని, అవి మానుకోవాలని హితవుపలికారు. పేదలంతా బాగుండాలంటే వైఎస్ జగన్‌ను మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. నెల్లూరు మేయర్ పీ స్రవంతి మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఎస్టీలకు అన్ని రంగాల్లో సముచిత స్థానం కల్పించారన్నారు. తాను ఎస్టీ మహిళనైనా ఉన్నత స్థానం కల్పించిన మహనీయుడు జగనన్న. ఎస్టీల కోసం ఎంతో చేసిన జగనన్నను గుండెల్లో పెట్టుకుని చూసుకోవాలన్నారు.



మహిళల వాద్య ప్రదర్శన



కేరళ కళాకారుల ప్రదర్శన



వైఎస్సార్ కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎంపీ విజయసాయిరెడ్డి, పక్కన అలీ, ఎమ్మెల్యే ప్రసన్న

# క్రీడా స్ఫూర్తిని పెంపొందించడమే లక్ష్యం




ఆడుదాం ఆంధ్రా కార్యక్రమాన్ని జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభిస్తున్న మంత్రి కాకాణి, ఎంపీ ఆదాల పక్కన జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, తదితరులు

- రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి
- అట్టహాసంగా 'ఆడుదాం ఆంధ్రా' ప్రారంభం

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): యువతలో క్రీడా స్ఫూర్తిని పెంపొందించడతో పాటు క్రీడా నైపుణ్యాన్ని వెలికితీయడమే లక్ష్యంగా 'ఆడుదాం ఆంధ్రా ' కార్యక్రమానికి రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శ్రీకారం చుట్టారని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. నెల్లూరులోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో 'ఆడుదాం ఆంధ్రా' కార్యక్రమాన్ని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, నెల్లూరు ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి, నగర మేయర్ పొట్లూరి స్రవంతి, జేసీ కూర్మనాథ్, నెల్లూరు కార్పొరేషన్ కమిషనర్ వికాస్‌మర్మత్‌తో కలిసి ఆయన మంగళవారం లాంఛనంగా ప్రారంభించారు. తొలుత జాతీయ, శాప్ క్రీడా జెండాలను ఆవిష్కరించారు. క్రీడాకారుల నుంచి క్రీడా వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా మంత్రి కాకాణి మాట్లాడుతూ రాష్ట్ర చరిత్రలో గతంలో ఎన్నడూ లేని విధంగా, దేశంలోని ఏ రాష్ట్రంలో జరగని విధంగా గ్రామ స్థాయి నుంచి ఆడుదాం ఆంధ్రా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలుతో పాటు యువతను ఉత్సాహంగా, ఉల్లాసంగా ముందుకు నడిపించాలనే లక్ష్యంతో సీఎం తీసుకున్న నిర్ణయం ఇది అన్నారు. గ్రామ, మండల, నియోజకవర్గ, జిల్లా, రాష్ట్ర స్థాయిలో పోటీలు జరుపుతున్నామని వివరించారు. క్రీడాకారుల్లో క్రీడాస్ఫూర్తిని నింపేందుకు ప్రజాప్రతినిధులు, అధికారులను భాగస్వాములను చేస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలోని లక్షలాది మంది క్రీడాకారులు తమ ప్రతిభను చాటేందుకు ఆడుదాం ఆంధ్రా దోహదపడుతుందన్నారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి చేపడుతున్న కార్యక్రమాలను దేశ వ్యాప్తంగా అనుసరించే స్థాయికి మన పరిపాలనా విధానం ఎదిగిందన్నారు. ఆడుదాం ఆంధ్రా కూడా రానున్న రోజుల్లో జాతీయ స్థాయిలో గుర్తింపు పొంది అనేక రాష్ట్రాలు మన బాటలో పయనించే అవకాశం ఉందన్నారు. క్రీడాకారులు క్రీడల్లో పాల్గొని క్రీడా స్ఫూర్తిని, క్రీడా ప్రతిభను చాటాలని పిలుపునిచ్చారు. జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ ఆలోచన మేరకు విద్యార్థులు చదువులకే పరిమితం కాకుండా క్రీడల్లోనూ రాణించి మంచి క్రీడాకారులుగా ఎదగాలని క్రికెట్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, బ్యాడ్మింటన్ క్రీడా పోటీలను నిర్వహిస్తున్నామని తెలిపారు. నెల్లూరు ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత యువతలో క్రీడా నైపుణ్యాన్ని గుర్తించి, వారిని ప్రోత్సహించే లక్ష్యంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దూరదృష్టితో చేసిన ఆలోచనే ఆడుదాం ఆంధ్రా కార్యక్రమమన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లాకు చెందిన రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయి క్రీడాకారులను పరిచయం చేయడం ఎంతో సంతోషకరమని, వారి స్ఫూర్తితో యువత క్రీడల్లో రాణించే అవకాశం ఉందన్నారు. అనంతరం మంత్రి కాకాణి క్రికెట్ ఆడి పోటీలను ప్రారంభించారు. సెల్ఫీ పాయింట్ వద్ద క్రికెట్ బ్యాట్‌తో సెల్ఫీ దిగారు. క్రీడాకారులకు క్రీడా కిట్లు అందజేశారు. నెల్లూరు డిప్యూటీ మేయర్ పీ రూప్‌కుమార్, నెల్లూరు ఏఎంసీ చైర్మన్ కోటేశ్వరరెడ్డి, విజయ డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, డీఎస్‌డీఓ ఆర్‌కే యతిరాజ్, కార్పొరేటర్లు, వివిధ శాఖల అధికారులు, సచివాలయ ఉద్యోగులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

## నేటి నుంచి డిపార్ట్‌మెంటల్ పరీక్షలు



మాట్లాడుతున్న డీఆర్వో లవన్న

నెల్లూరు(దర్గామిట్ట): జిల్లాలో బుధవారం నుంచి జనవరి 3వ తేదీ వరకు డిపార్ట్‌మెంటల్ పరీక్షలను నిర్వహించనున్నట్లు డీఆర్వో లవన్న తెలిపారు. మంగళవారం ఆయన తన ఛాంబర్‌లో డిపార్ట్‌మెంటల్ పరీక్షల నిర్వహణపై ఆయా శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా కేంద్రమైన నెల్లూరులో ఒకటి, కావలిలో రెండు పరీక్ష కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఉదయం 10 నుంచి 2 గంటల వరకు, మధ్యాహ్నం 3 నుంచి 5 గంటల వరకు పరీక్షలు జరుగుతాయని చెప్పారు. ఉదయం పరీక్షలకు 9.15 గంటలలోపు, మధ్యాహ్నం పరీక్షలకు 2.15 గంటలలోపు మాత్రమే పరీక్ష కేంద్రాల్లోకి అభ్యర్థులను అనుమతించనున్నట్లు తెలిపారు. గ్రేస్ పీరియడ్ కింద మరో 15 నిమిషాలు అనుమతి ఇస్తామన్నారు. తెలిపారు. పరీక్షలను పక్కాగా నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని పరీక్ష కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్లు, లైజన్ అధికారులు, పోలీసు, మెడికల్, విద్యుత్ శాఖ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అన్ని పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ విధించాలని తహసీల్దార్లను కోరారు. ఈ సమావేశంలో తహసీల్దారు రాఘవేంద్రరావు, పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### బంగారు గొలుసు బహూకరణ



ఈఓకు బంగారు గొలుసు అందజేస్తున్న దాతలు

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: మండలంలోని జొన్నవాడలో వెలసిన మల్లికార్జున స్వామి సమేత కామాక్షితాయి అమ్మవారికి ఒంగోలుకు చెందిన వి.ప్రమోద్‌కుమార్, సునీత దంపతులు మంగళవారం 17 గ్రాముల బంగారు గొలుసును బహూకరించారు. ఈ సందర్భంగా ఈఓ గిరికృష్ణ, చైర్మన్ సుబ్రహ్మణ్యంనాయుడు దాతలను సత్కరించి, తీర్థ ప్రసాదాలు అందజేశారు.

### మహిళ ఆత్మహత్య

పొదలకూరు: మండలంలోని అమ్మవారిపాళెం గ్రామానికి చెందిన మహిళ మంగళవారం ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఇన్‌చార్జి ఎస్సై మస్తానయ్య కథనం మేరకు.. కోటా జగదీశ్వరి (55) గ్రామంలో నివాసం ఉంటున్నారు. ఆమె భర్త మరణించారు. ఇద్దరు కుమార్తెలకు వివాహమైంది. జగదీశ్వరి కొంతకాలంగా ప్రతి చిన్న విషయానికి కోప్పడుతూ ఉండేది. ఈ క్రమంలో ఇంట్లో జరిగిన చిన్నపాటి వివాదానికే మనస్తాపం చెంది ఫ్యాన్‌కు చీర తగిలించి ఉరేసుకుంది. కుటుంబసభ్యులు గుర్తించి బాధితురాలిని పొదలకూరు సీహెచ్‌సీకి తరలించి చికిత్స అందించేందుకు ప్రయత్నించగా అప్పటికే ఆమె మృతిచెందారు. ఎస్సై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### పీహెచ్‌సీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా అమరేంద్రనాథ్‌రెడ్డి



అమరేంద్రనాథ్‌రెడ్డి

నెల్లూరు సిటీ: ఆంధ్రప్రదేశ్ పీహెచ్‌సీ డాక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా సి.అమరేంద్రనాథ్ రెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యవర్గాన్ని మంగళవారం ఎన్నికల అధికారి పీఎల్ దయాకర్ ప్రకటించారు. ఉపాధ్యక్షులుగా వైద్యులు పి.శ్రావణి, సునీల్‌కుమార్, జనరల్ సెక్రటరీగా శ్రీనివాసులు, ట్రెజరర్‌గా రవీంద్రనాథ్‌రెడ్డి, జాయింట్ సెక్రటరీలుగా సయ్యద్ అహ్మద్‌బాబు, నవీన్, శివకల్పన, ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా బాలచంద్రబాబు, నరసింహారావు, ఈసీ సభ్యులుగా శ్రీనివాస్, నరేంద్ర, బ్రహ్మేశ్వరనాయుడు, హజరత్‌రెడ్డి, నసీరుద్దీన్, సూర్య ధర్మేంద్ర, జ్యోతి నియమితులయ్యారు. వీరు రెండు సంవత్సరాలపాటు పదవిలో ఉంటారు. నూతన కార్యవర్గం నెల్లూరులోని సంతపేటలో ఉన్న వైద్యారోగ్య శాఖ కార్యాలయంలో డీఎంహెచ్‌ఓ పెంచలయ్యను మర్యాదపూర్వకంగా కలిసింది.

### నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

| | |
|---|---|
| బ్రాయిలర్ (లైవ్) | : 97 |
| లేయర్ (లైవ్) | : 90 |
| బ్రాయిలర్ చికెన్ | : 180 |
| బ్రాయిలర్ స్కిన్‌లెస్ | : 200 |
| లేయర్ చికెన్ | : 153 |





క్రీడా వందనం స్వీకరిస్తున్న మంత్రి గోవర్ధన్‌రెడ్డి, ఎంపీ ప్రభాకర్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ అరుణమ్మ తదితరులు



ప్రతిజ్ఞ చేస్తున్న క్రీడాకారులు, అధికారులు, విద్యార్థులు తదితరులు

## క్రీడా సంబరం

ఆడుదాం ఆంధ్రా.. యువతలో క్రీడా స్ఫూర్తిని నింపి.. వారిలోని నైపుణ్యాలను వెలికి తీయడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన అతిపెద్ద క్రీడా సంబరం ఇది. నెల్లూరులోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, నెల్లూరు ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి తదితరులు మంగళవారం పండగ వాతావరణంలో ఈ క్రీడా పోటీలకు శ్రీకారం చుట్టారు. నియోజకవర్గాల్లో ప్రజాప్రతినిధులు, అధికారులు పోటీలను ప్రారంభించారు.

– నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట)



క్రీడా జ్యోతిని అందుకుంటున్న మంత్రి గోవర్ధన్‌రెడ్డి

బ్యాటింగ్ చేస్తున్న మంత్రి కాకాణి







బెలూన్లు ఎగురవేస్తున్న మంత్రి, ఎంపీ, జెడ్పీ చైర్‌పర్సన్

– సాక్షి ఫొటోగ్రాఫర్, నెల్లూరు

## నారాయణా.. మీ చిట్టా మొత్తం విప్పుతాం

- నెల్లూరు సిటీ ఎమ్మెల్యే డాక్టర్ పి.అనిల్ కుమార్



సీసీ రోడ్లు, డ్రెయిన్లకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే అనిల్ కుమార్

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): రోజూ మాపై లేనిపోనివి మాట్లాడితే మాజీ మంత్రి నారాయణ చిట్టా మొత్తం విప్పాల్సి వస్తుందని నెల్లూరు సిటీ ఎమ్మెల్యే డాక్టర్ పి.అనిల్ కుమార్ హెచ్చరించారు. నగరంలోని 8వ డివిజన్ ముగ్గురాళ్ల వీధి, స్టోన్‌హౌస్‌పేట, అరుంధతీయపాళెం, పరుచూరువారి వీధి ప్రాంతాలకు సంబంధించి రూ.కోటితో సీసీ రోడ్లు, సీసీ డ్రెయిన్ల నిర్మాణానికి అనిల్ మంగళవారం శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నగరంలో అభివృద్ధి చేయలేదని నారాయణ మాట్లాడుతున్నారన్నారు. దీనిపై చర్చకు రమ్మని పిలిస్తే సమాధానం చెప్పే పరిస్థితి లేదన్నారు. మున్సిపల్ స్కూల్స్, అర్బన్ హెల్త్ సెంటర్లు, పెన్నా బ్యారేజీ పూర్తి, సర్వేపల్లి కాలువ, జాఫర్‌సాహెబ్ కాలువ రీటైనింగ్ వాల్స్, హరనాథపురం సెంటర్‌లో ఫ్లై ఓవర్ తదితర పనులు తమ ప్రభుత్వంలోనే చేశామన్నారు. నారాయణ ఎన్నికలప్పుడు మాత్రమే వచ్చి హడావుడి చేస్తారన్నారు. ఆయన మెడికల్ కళాశాలలో మాత్రమే ఆడబిడ్డలు ఎందుకు చనిపోతున్నారని ప్రశ్నించారు. ఇలాంటి సంఘటనలను పక్కనపెట్టి తమపై నిందలు మోపితే సహించేది లేదన్నారు. ఆడబిడ్డలు చనిపోయినప్పుడు నారాయణ కనీసం కడచూపు కూడా చూడలేదన్నారు. వారి కుటుంబసభ్యులను పరామర్శించిన దాఖలాలు లేవన్నారు. విద్యార్థుల వద్ద రూ.లక్షలు ఫీజులు వసూలు చేస్తూ చదువులు చెప్పాల్సిన ఉపాధ్యాయులను ఎన్నికల పనుల్లో రోడ్లపై తిప్పడం మంచి పద్ధతి కాదన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ మొగళ్లపల్లి కామాక్షిదేవి, నాయకులు పాల్గొన్నారు.

## అల్లూరుపేట పోలేరమ్మ జాతర మొదటి చాటింపు

అల్లూరు: అల్లూరుపేట పోలేరమ్మ జాతరకు సంబంధించి మొదటి చాటింపును మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఉత్సవం జనవరి 9వ తేదీన జరుగుతుంది. పోలేరమ్మ దేవస్థానంలో మొదటగా ఆసాధులు ప్రత్యేక పూజలు చేసి చాటింపును నిర్వహించారు. కార్యనిర్వాహకులు మన్నెమాల సుకుమార్‌రెడ్డి, మేడా రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ జాతరను సంప్రదాయబద్ధంగా వైభవంగా నిర్వహిస్తామన్నారు. ఎంపీలు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఆదాల ప్రభాకర్‌రెడ్డి, రాజ్యసభసభ్యుడు బీద మస్తాన్‌రావు, ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కాటంరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి, బీద రవిచంద్ర, అల్లంపాటి లోకేశ్‌బాబు సహకారంతో ఉత్సవాన్ని నిర్వహిస్తున్నామని తెలియజేశారు.



పూజలు చేస్తున్న దృశ్యం

## పేదల జీవితాల్లో సంక్షేమ వెలుగులు



బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి

- కావలి ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి

కావలి: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు పేదల జీవితాల్లో వెలుగులు నింపుతున్నాయని కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి అన్నారు. కావలిలోని 15వ వార్డులో మంగళవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. ఎమ్మెల్యే ప్రతి ఇంటికీ వెళ్లి పథకాల జరిగిన లబ్ధిని వివరించి బుక్‌లెట్లు పంపిణీ చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ పథకాల అమలులో జగనన్న చాంపియన్‌గా నిలిచారని కొనియాడారు. నాడు – నేడు పథకంతో విద్య, వైద్యరంగాల్లో అనేక మార్పులు తెచ్చారన్నారు. పేదలు, బడుగు బలహీనవర్గాల సంక్షేమం కోసం జగనన్న చేస్తున్న మంచి దేశంలో ఏ ముఖ్యమంత్రి చేయట్లేదని చెప్పారు. చంద్రబాబు నాయుడు రాజకీయంగా చేసిన అరాచకాలు అందరికీ తెలిసిందేనని ఎమ్మెల్యే అన్నారు. ఆయన అధికారంలో ఉన్న సమయంలో ప్రత్యేక హోదా వద్దు, ప్రత్యేక ప్యాకేజీ ముఖ్యమని చెప్పిన నాయకుడన్నారు. బాబు, తన హయాంలో లెక్కకు మించి స్కామ్‌లు చేశాడన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు కేతిరెడ్డి జగదీశ్వరరెడ్డి, కలికి ప్రభాకర్‌రెడ్డి, పూనూరు అమర్‌నాథ్‌రెడ్డి, తిరుపాలు, మందా శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి, సంక్షేమం వైఎస్సార్‌సీపీతోనే సాధ్యం



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎంపీ ఆదాల

- నెల్లూరు ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి

నెల్లూరు రూరల్: అన్ని వర్గాల సంక్షేమం, రాష్ట్రాభివృద్ధి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంతోనే సాధ్యమని నెల్లూరు ఎంపీ, రూరల్ నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఆదాల ప్రభాకర్‌రెడ్డి అన్నారు. రూరల్ పరిధిలోని 21వ డివిజన్‌లో పలు అభివృద్ధి పనులకు మంగళవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారానికి నిధులు మంజూరు చేయించి, పనులను త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. స్థానిక డివిజన్‌లో రూ.1.80 కోట్లతో వివిధ పనులు చేయడం జరిగిందన్నారు. మరో రూ.1.20 కోట్లను మంజూరు చేస్తామన్నారు. పార్టీ నాయకులు కూడా సమస్యలను గుర్తించి తన దృష్టికి తీసుకురావాలన్నారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ గెలుపే లక్ష్యంగా పనిచేయాలన్నారు. ప్రభుత్వం అందించిన సేవలను ప్రజలకు వివరించాలన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ మొయిళ్ల గౌరి, జేసీఎస్ కన్వీనర్ సురేష్‌రెడ్డి, మేయర్ స్రవంతి, విజయ డెయిరీ చైర్మన్ రంగారెడ్డి, నాయకులు కార్యకర్తలు నగరపాలక సంస్థ అధికారులు, సచివాలయాల సిబ్బంది స్థానికులు పాల్గొన్నారు.

## కష్టపడి చదివి.. ఎస్సై పోస్టుకు ఎంపికై..



తల్లి సుశీలతో ఏడుకొండలు

కందుకూరు రూరల్: ఆ యువకుడి తండ్రి చిన్నతనంలోనే మరణించాడు. తల్లి కష్టపడి చదివించింది. అతను ఇటీవల విడుదలైన ఎస్సై ఫలితాల్లో 398వ ర్యాంక్ సాధించాడు. వివరాలిలా ఉన్నాయి. వలేటివారిపాళెం మండలం పోలినేనివారిపాళెం గ్రామానికి చెందిన నేలకూరి వెంకటేశ్వర్లు, సుశీల కుమారుడు ఏడుకొండలు ఒకటి నుంచి ఏడో తరగతి వరకు స్వగ్రామంలోనే చదివాడు. 8 నుంచి 10 వరకు కందుకూరులోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో అభ్యసించాడు. ఇంటర్మీడియట్ టీఆర్‌ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల, టీటీసీ సింగరాయకొండ పీఎన్‌సీఏలో పూర్తి చేశాడు. ఉపాధ్యాయ పోస్ట్ సాధించాలని కోచింగ్ తీసుకొని రెండుసార్లు డీఎస్సీలో తన అదృష్టాన్ని పరీక్షించుకున్నా ఫలితం దక్కలేదు. అనంతరం ఆర్థిక పరిస్థితులతో చదువు కొనసాగించలేక, ఇంటి వద్దే ఉంటూ వ్యవసాయ పనులకు వెళ్తూనే ఓపెన్ యూనివర్సిటీలో డిగ్రీ పూర్తి చేశాడు. తండ్రి చిన్నతనంలోనే మరణించడంతో బాధ్యతంతా తల్లి మీదే పడింది. ఎలాగైనా ఉద్యోగం సాధించాలనే పట్టుదలతో ఎస్సై పోస్టుకు దరఖాస్తు చేసుకుని కాకినాడలో కోచింగ్‌కు వెళ్లాడు. తల్లి ప్రతి నెలా కోచింగ్, మెస్ ఫీజులకు నగదు పంపేది. ఏడుకొండలు పరిస్థితిని గమనించి గ్రామానికి చెందిన అనుమోలు రవీంద్ర, మాదాల లక్ష్మీనరసింహం ఆర్థిక సాయం అందించి భరోసానిచ్చారు.

### చదువే ఆయుధం

కష్టాలు ఉన్నాయని కుంగిపోతే చదువుకోలేం. ఇష్టపడి చదవాలి. తల్లి రెక్కల కష్టం నాకు తెలిసొచ్చింది. అందుకే పట్టుదలతో చదివి ఎస్సై పోస్టు సాధించాను. పేదలకు చదువే ఆయుధం.

– నేలకూరి ఏడుకొండలు

### నిమ్మ ధరలు (కిలో)

| | |
|---|---|
| పెద్దవి | : రూ.21 |
| సన్నవి | : రూ.15 |
| పండ్లు | : రూ.5 |

